

సాగుకు నీటి విడుదల

ఆత్మకూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా సోమవారం నుంచి వారబంది ప్రకారం సాగునీటిని విడుదల చేయనున్నామని ప్రాజెక్టు ఈఈ జగన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి నాలుగు రోజులపాటు ఎడమ కాలువ ద్వారా 20 వేల ఎకరాల ఆయకట్టుకు రామన్‌పాడు రిజర్వాయర్ వరకు సాగునీటిని విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. ఏప్రిల్ మూడో మాసం వరకు సాగునీటిని విడుదల చేసే అవకాశం ఉంది. కావునా రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



పెంచిన మెనూ ప్రకారం చికెన్‌తో భోజనం చేస్తున్న విద్యార్థులు

కామన్ మెనూ.. బాగుంది

- పదహారేళ్ల తరువాత పెరిగిన మెస్, కాస్మెటిక్ చార్జీలు
- బాల, బాలికలకు రూ. 75 నుంచి రూ. 275 కు పెంపు
- గద్వాల జిల్లాలో 3,389 మంది విద్యార్థులకు లబ్ధి
- వసతి గృహాల్లోని ఒక్కో విద్యార్థికి అదనంగా రూ. 440
- ఇంటర్ విద్యార్థులకు నెలకు రూ.600
- వారంలో మటన్ భోజనం, గుడ్లు, పండ్లు



పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు గత పాలకులు మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచలేదు. ప్రభుత్వం అందించే మెస్ చార్జీలు పెరిగిన ధరలకు సరిపోకపోవడంతో భోజనం నాణ్యతగా అందించేవారు కాదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి వసతి గృహ విద్యార్థుల బాగోగులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో మెస్, కాస్మెటిక్ చార్జీలు తక్కు వగా ఉండటంతో నాణ్యమైన భోజనం అందడం లేదని వెంటనే చార్జీలు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. పెంచిన చార్జీలతో నాణ్యమైన భోజనం అందుతోందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- అయిజటౌన్, ఆంధ్రజ్యోతి

6



ఈనెల 18వ తేదీన జాతీయ రహదారిపై జరిగిన చోరీకి సంబంధించిన వివరాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)

దొరకని దొంగలు

- జిల్లాలో తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యం
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- పోలీసులకు సవాల్‌గా మారుతున్న ఘటనలు

6

రూ.లక్ష కొట్టు- బెల్ట్‌షాపు పెట్టు..

- నల్లమలలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- దోమలపెంటలో బెల్ట్‌షాపు ఏర్పాటుకు రూ. 2 లక్షలు
- క్వార్టర్ లిక్కర్‌పై రూ.20 అధికంగా అమ్మకాలు
- పత్తాలేని ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ శాఖ అధికారులు

6

క్రీడాకారులు ప్రతిభను చాటాలి

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అన్ని ఈవెంట్లలో ప్రతిభ చాటాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సీఎం కప్-2024 క్రీడా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం పెంచడమే కాకుండా సమా జంలో గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతీ క్రీడాకారుడు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం ఆయా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు షీల్డ్, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో డాక్టర్ బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

అమ్మానాన్న.. స్ఫూర్తి

- వారిద్దరూ ప్రభుత్వ అధికారులే.. వారి నుంచి చాలా నేర్చుకున్నా
- ఢిల్లీలోనే చదువుకోవడం కూడా సివిల్స్‌పై ఆసక్తి కలిగేలా చేసింది
- విద్యార్థులు ఆత్మన్యూనతను వీడేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్ ప్రోగ్రాం
- సాగునీటి రంగంలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ప్రతిపాదనలు
- ట్రైబ్యునల్స్ లేకపోవడం వల్ల అనేక భూ సమస్యలు పెండింగ్‌లోనే..
- 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



"ప్రజలు నిత్య జీవితంలో ఎదుర్కొనే అనేక సమస్యలను పరిష్కరించడానికి సివిల్ సర్వీసెస్ మంచి వేదిక.. అమ్మానాన్నలు ఇద్దరు ప్రభుత్వ అధికారులు కావడం, వారిద్దరూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పనులను చూసి చిన్నతనం నుంచే నాలో కూడా సివిల్ సర్వీసెస్ వైపు వెళ్లాలనే ఆసక్తి పెరిగింది. వారిద్దరి స్ఫూర్తితో ఢిల్లీ ఐఐటీలో మెకానికల్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేసి 2016లో మొదటిసారి పరీక్ష రాశాను. మెయిన్స్ క్లియర్ అయినా ఇంటర్వ్యూలో మిస్ అయ్యింది. 2017లో రాయడంతో ర్యాంకు వచ్చింది. తెలంగాణ కేడర్‌కే ఎంపికయ్యాను. చిన్నతనం నుంచి ఢిల్లీలో చదవడం కూడా నేను సివిల్స్ వైపు రావాలనే ఆసక్తి పెరగడానికి మరో కారణం. ట్రైనీ కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, ప్రస్తుతం వనపర్తి జిల్లాకు కలెక్టర్‌గా పనిచేస్తున్నాను. ఈ జర్నీలో అనేక సమస్యలను పరిష్కారం చేశాం. ఎంతో నేర్చుకొని ఇంకా మెరుగ్గా ప్రజలకు సేవలందించడానికి ప్రయత్నం చేస్తున్నాం"

మహబూబ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రజలు పడుతున్న పాట్లను గమనిస్తూ.. వారి సమస్యలు పరిష్కరించేందుకు అమ్మానాన్నల స్ఫూర్తితోనే ముందుకు సాగుతున్నానని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఆయన తన ప్రయాణంలో ఎదుర్కొన్న పలు అంశాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఆ వివరాలు..

కుటుంబ నేపథ్యం ఏమిటి? విద్యాభ్యాసం ఎలా జరిగింది...?

నాన్న సత్తయ్య.. తహసీల్దార్ నుంచి అంచలంచెలుగా ఎదిగి కామారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా ఉద్యోగ విర మణ పొందారు. అమ్మ నర్సమ్మ, ఐఆర్ఎస్ ఆఫీసర్. ఇన్‌కం ట్యాక్స్ విభాగంలో పనిచేసి ఇటీవల మేలో ఉద్యోగ విరమణ పొందారు. నాన్నది కరీంనగర్. అమ్మది ప్రకాశం జిల్లా. ఇద్దరూ సివిల్ సర్వెంట్స్ వరంగల్‌లో 4వ తరగతి వరకు చదివిన తర్వాత మిగతా చదువంతా ఢిల్లీలోనే సాగింది. ఐఐటీ ఢిల్లీలో మెకానికల్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. అక్కడ సివిల్ సర్వీసెస్ కోసం పోటీపడే అభ్యర్థులు చాలా మంది ఉంటారు. వారందరినీ చూస్తూ ఇంజనీరింగ్ తర్వాత సివిల్స్ ప్రిపేర్ అయ్యాను. 2016లో మొదటి అటెంప్ట్. 2017లో రెండో అంటెప్ట్‌లో ర్యాంకు వచ్చింది. ఇన్‌సైడర్ కేటగిరిలో తెలంగాణ కేడర్ వచ్చింది.

వనపర్తికి ముందు ఎక్కడెక్కడ పనిచేశారు.. ఆ అనుభవాలు..?

నేను అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రెయినీగా ఖమ్మంలో పనిచేశాను. ఆ తర్వాత ములుగులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేశాను. ఆ తర్వాత తిరిగి ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషన ర్‌గా పనిచేశాను. ఖమ్మం కార్పొరేషన్ అర్బన్ పాపులే షన్, ములుగు మొత్తం రూరల్ పాపులేషన్, ప్రజల అప్రోచ్ అయ్యే విధానంలో చాలా తేడాలు ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఏదైనా చెబితే అర్థం చేసుకుంటారు. పట్టణ ప్రాంత ప్రజలకు ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంటుంది. లిటిగేషన్లు కూడా పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. ములుగులో ఉన్నప్పుడు ఫారెస్టు, రెవెన్యూ సమస్యలు పరిష్కారం చేశాం. ఇప్పుడు నిర్మాణమైన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల స్థలం కూడా వివాదంలో ఉంటే పరిష్కరించాం. మేడారం, పస్రా వరకు మీడియన్, అవెన్యూ ప్లాంటేషన్ బాగా చేశాం. ఖమ్మంలో లకారం బ్రిడ్జి కట్టించడం, గొల్లపాడు

మిగతా 6వ పేజీలో...

ఇసుక రవాణాలో తెగని సరిహద్దు పంచాయితీ..

- మరోసారి అడ్డుకున్న ఏపీ పోలీసులు
- హద్దులను ఏర్పాటు చేయాలంటున్న తూర్పు గార్లపాడు గ్రామస్థులు



సరిహద్దును పరిశీలించేందుకు నదిలోకి వెళుతున్న రాజోలి ఎస్ఐ జగదీశ్వర్, పోలీస్ సిబ్బంది

రాజోలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తుంగభద్ర నదిలో నుంచి ప్రభుత్వ అనుమతులతో తరలిస్తున్న ఇసుకకు సరిహద్దు పంచాయితీ మరోసారి చెలరేగింది. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని తూర్పు గార్లపాడు శివారులోని తుంగభద్ర నదిలో ఇసుక తరలించేందుకు 'మన ఇసుక వాహనం' పథకానికి అనుమతులు ఉన్నాయి. అయినా ఏపీ పోలీసులు, అటుగా ఉన్న కొంతలపాడు గ్రామస్థులు అడ్డుపడుతూనే ఉన్నారు. జూన్ 21న సరిహద్దు దాటకుండా తెలంగాణ హద్దుల్లోనే ఇసుకను తరలిస్తుంటే ఏపీ అధికార యంత్రాంగం తెలంగాణకు సంబంధించిన ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఉన్నతాధికారుల చర్చలు జరపడంతో ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ. 5 వేలు చొప్పున మొత్తం 64 ట్రాక్టర్లకు జరిమానా వేసి వదిలేశారు. గురువారం మరోసారి అలాంటి పరిస్థితి ఎదురైంది. తూర్పు గార్లపాడు శివారులో ఇసుక కోసం 'మన ఇసుక వాహనం' ట్రాక్టర్లు గురువారం నదిలోకి దిగితే మళ్లీ ఏపీ పోలీసులు, కొంతలపాడు గ్రామస్థులు అడ్డుకున్నారు. అనంతరం రాజోలి పోలీ సులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ జగదీశ్వర్, పోలీస్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్ మీదుగా నదిలోకి వెళ్లి బార్డరును పరిశీలించారు. గూగుల్ మ్యాప్‌లో పరిశీలిస్తే ఇది తెలంగాణ బార్డరులోనే ఉందని, ఏపీ బార్డరు కాదని చెప్పడంతో ఏపీ వారు వెనుతిరిగి వెళ్లారు. త్వరలో జిల్లా అధికారులు వచ్చి నదిలో సరిహద్దును ఏర్పాటు చేస్తారని ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఇదిలా ఉండగా తుమ్మిళ్ల శివారులోని తుంగభద్రకు అటువైపుగా ఉన్న సంగాల గ్రామం శివారులో ఏపీ ప్రభుత్వం తెలంగాణ బార్డరుకు వచ్చి ఇసుకను తోడేస్తుంటే అధికారులు స్పందించడం లేదని, తెలంగాణ సరిహద్దులోనే ఇసుకను తరలిస్తుంటే ఏపీ పోలీసులు అడ్డుపడుతున్నారని తూర్పు గార్లపాడు గ్రామస్థులు, ట్రాక్టర్ యజమానులు ఆరోపిస్తున్నారు.

ప్రారంభానికి మెడికల్ కాలేజి సిద్ధం

- వినియోగంలోకి రానున్న 630 పడకల ఆసుపత్రి



ప్రారంభోత్సవానికి ముస్తాబైన నాగర్‌కర్నూల్ మెడికల్ కాలేజి

నాగర్‌కర్నూల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆధునాతన సౌకర్యాలతో కందనూలు మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఉయ్యాలవాడ శివారులో నిర్మించిన మెడికల్ కాలేజ్ కొత్త రూపు సంతరించుకుంది. రెండున్నరేళ్ల క్రితం వైద్య కళాశాల మంజూరైంది. మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభానికి 330 పడకల ఆసుపత్రి వైద్య కళాశాలకు అనుబంధంగా ఉండాలని జిల్లా కేంద్రంలో ఉన్న ఏరియా ఆసుపత్రిని 330పడకలకు తీర్చిదిద్దారు. ఆ తర్వాత యుద్ధప్రాతిపదికన ఉయ్యాలవాడ శివారులో భవనాన్ని నిర్మించి వైద్య కళాశాలకు అనుమతులు పొందారు. మెడికల్ కాలేజి సిబ్బంది, డాక్టర్లు అత్యవసర విభాగానికి సంబంధించి దాదాపు 40ఎకరాల భూసేకరణ చేశారు. డాక్టర్లు, సిబ్బంది నివాసానికి నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి.

రూ.168 కోట్లతో కొత్త భవనం

వైద్య కళాశాల నిర్వాహణకు రూ.168 కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణం పూర్తైంది. మెడికల్ కాలేజీలో 450మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇప్పటికే వైద్య విద్యార్థుల కోసం హాస్టల్ నిర్మాణాలు పూర్తయ్యాయి. వారిని అక్కడ షిఫ్ట్ చేశారు. మెడికల్ కాలేజ్ ప్రాంగణంలోని హాస్టల్ కూడా ఉండడంతో విద్యార్థుల ఇక్కట్లు తీరిపోయాయి.

నర్సింగ్ కాలేజి బిల్డింగ్‌లో 300 పడకల ఆసుపత్రి

మెడికల్ కాలేజీలో మూడో సంవత్సరం విద్యా అనుమతికి 630 పడకల ఆసుపత్రిని నిర్మించాల్సి ఉంది. అయితే ఈ ఇబ్బందులన్నింటినీ అధిగమించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటుంది. మెడికల్ కాలేజ్ నిర్మాణ అనుమతుల కోసం ఏరియా ఆసుపత్రిని ఆధునీకరించారు. మూడో సంవత్సర అనుమతి కోసం నర్సింగ్ కాలేజిని 300 పడకల ఆసుపత్రికి మార్చనున్నారు. ఇందు కోసం కావాల్సిన వనరులను సమీకరించారు.

అధునాతన సదుపాయాలు



కొత్త మెడికల్ కాలేజి భవనం ఆధునాతన సౌకర్యాలతో అందుబాటులోకి రానున్నది. ఇందులో అనాటమీ, ఫిజియాలజీ, ఫార్మాటాలజీ, బయో కెమిస్ట్రీ, ఫోరెన్సిక్, ఎస్‌పీఎం, మైక్రో బయాలజీ, కమ్యూనిటీ మెడిసిన్‌కు సంబంధించి ల్యాబ్‌లు ఉంటాయి. మెడికల్ కాలేజ్‌లో 1001 రెగ్యులర్ స్టాఫ్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది 544 మంది ఉంటారు. కొత్త భవనం ప్రారంభోత్సవానికి సిద్ధం చేశాం.

- డాక్టర్ రమాదేవి, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్

మెనూ అమలు చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

వంగూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ అమలు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని జాజాల ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆరోగ్యం, చదువు అత్యంత ప్రధానమైనవని, పాఠశాలలో వసతులు, భోజనం నాణ్యతలో రాజీపడొద్దని ఆదేశించారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ భాస్కర్, ఎంపీవో వెంకటేష్, తదితరులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి

- వనపర్తిలో ఐటీ టవర్‌కు రూ.22 కోట్లు మంజూరు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తి అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి మంత్రులు మద్దతు తెలిపినట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తెలిపారు. గురువారం వనపర్తి పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు, విద్య, వైద్యం, వ్యవసాయం, నిరుద్యోగంపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. దీనికి గాను ఏడాదికి రూ.20వేల కోట్ల చొప్పున మొత్తం ఒక లక్ష కోట్ల రూపాయలతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో అభివృద్ధి పనులు చేసేందుకు ఖర్చు పెట్టబోతున్నార ని తెలిపారు. వనపర్తి పట్టణ సమీపంలో ఐటీ టవర్ నిర్మాణానికి రూ.22 కోట్లు మంజూరైనట్లు చిన్నారెడ్డి తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులు, పెండింగ్ ప్రాజెక్టులు, వాటి కింద సాగు వివరాలను ముఖ్యమంత్రికి అందజేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. పది ఏళ్లలో ఉమ్మడి జిల్లాను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, అందుకే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని ఆ పార్టీని తరిమికొట్టి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారని తెలిపారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాయకులు రాగివేణు, కోళ్ల వెంకటేష్, బాబా తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం

- ఆయిల్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ రాఘవరెడ్డి

కొత్తపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం సాధించవచ్చని ఆయిల్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ జంగం రాఘవరెడ్డి అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని నిడ్జింతలో గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశానికి చైర్మన్‌తోపాటు ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల, జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి హాజరయారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామగ్రామాన ఆయిల్‌పాం పెంచడానికి అవగాహన సమావేశాల ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. వరికి బదులుగా రైతులు ఆయిల్‌పాం సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొంది ఆర్థికంగా ఎదుగుతారన్నారు. రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేసి సాగుకు అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్, సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ మేనేజర్ సత్యనారాయణ, జిల్లా సభ్యులు చంద్రశేఖర్, సమీన తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మెగా మార్కెట్ యార్డు

» మహబూబ్‌నగర్ మార్కెట్‌ను పరిశీలించిన అధికారులు

పాలమూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌ను సూపర్ మెగా మార్కెట్ యార్డుగా మా రుతోందని రాష్ట్ర, జిల్లా వ్యవసాయాధికారులు అన్నారు. గురువా రం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ను కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనితతో కలిసి హైదరాబాద్ నుంచి జేడీ, ఎస్ఈ, డీఈ, డీ ఎంవో, ఏఈ, మార్కెట్ కార్యదర్శులు పరిశీలించారు. మార్కెట్‌లోని అన్ని పరిసరా లను పరిశీలించి దీనిని సూపర్ మెగా మార్కెట్ యార్డుగా మార్చేందుకు అవకా శాలు ఏమి ఉన్నాయని పరిశీలించారు.

అమ్మానాన్న.. స్ఫూర్తి

(మొదటిపేజీ తరువాయి)

చానల్‌ను పూడ్చివేసి.. అండర్‌గ్రౌండ్ పైపులు వేయడం ద్వారా పార్కులు, స్కేటింగ్ రింగ్, ఓపెన్ జిమ్‌లు నిర్మించాం. ఒక్కోసారి చిన్నచిన్న పనుల్లో ఎక్కువ సంతృప్తినిస్తాయి. ములుగులో ఒక వృద్ధురాలికి పింఛన్ ఇప్పిస్తే ఆమె నా దగ్గరకు వచ్చి కృతజ్ఞతలు చెప్పి దీవించడం చాలా సంతృప్తినిచ్చింది.

● వైద్యరంగంపై ఎక్కువ ఫోకస్ పెట్టినట్లున్నారు, రిజల్ట్ ఎలా ఉన్నది..?

నేను ఖమ్మం కమిషనర్‌గా చేసినప్పుడు డ్రైడే డ్రైడే కార్యక్రమం చాలా సత్ఫలితాలనిచ్చింది. ఇక్కడకు వచ్చిన తర్వాత డెంగ్యూ పరీక్షలు తక్కువ అవుతున్నాయని గుర్తించాం. 2021లో 306, 2022లో 134, 2023లో 65 పరీక్షలు చేశారు. దీంతో పాజిటివ్ శాతం తక్కువగా వచ్చింది. 2024లో 24120 టెస్టులు చేశాం. 143 పాజిటివ్ వచ్చాయి. పరీక్షలు చేసినప్పుడే మెరుగైన వైద్యం అందించవచ్చు. అలాగే డయాబెటీస్ స్క్రీనింగ్‌ను ప్రత్యేకంగా తీసుకున్నాం. మిషన్ మధుమేహం పేరుతో కార్యక్రమం చేపట్టి 30 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్షలు చేస్తున్నాం. ఇప్పటివరకు 60 వేల మందికి స్క్రీనింగ్ అయ్యింది. అందులో 4 వేల మందికి టైప్ టు డయాబెటీస్ నిర్ధారణ అయ్యింది. డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ రాంచందర్ రావులు దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేస్తున్నారు. టీబీ నిర్ధారణ కోసం వారి పరీక్షల కోసం ప్రత్యేక మొబైల్ ఎక్స్‌రేను సమకూర్చాం. చిన్నచిన్న మొత్తాలు ఖర్చు చేయడం వల్ల ఎక్కువ ఫలితాలు వస్తాయి.

● విద్యార్థులకు కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని తీసుకున్నారు..? పనితీరు ఎలా ఉంటుంది?

విద్యార్థులు చాలా ఆత్మన్యూనతకు గురవుతున్నారు. మార్కులు రాలేదనో, అందంగా లేననో, ఇంట్లో వారు చూడటానికి రావడం లేదనో, హోం సిక్ నెస్‌తోనో, ఎదుటివారితో పోల్చుకోవడంలోనో ఏదో రకంగా మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. వారు ఆత్మన్యూనత వీడేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం చేపట్టాం.



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఇందులో సైకియాట్రీషియన్, సఖి సెంటర్, ఆర్‌బీఎస్‌కే నుంచి ఒక బృందంగా ఏర్పాటు చేసి 10 నుంచి 20 ప్రశ్నలతో ఒక పరీక్షలా నిర్వహించి ఏ విషయంలో ఒత్తిడికి లోనవుతున్నారనే విషయం తెలుసుకోవడం ద్వారా వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించాం. ప్రస్తుతం సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్‌లో కార్యక్రమం జరుగుతోంది. తర్వాత కేజీవీబీలు, గురుకులాలకు విస్తరిస్తాం. 1098 చైల్డ్ లైన్‌ను, 14416 24/7 కౌన్సెలింగ్‌ను వాడుకునేలా 2016 మెంటల్ హెల్త్ కేర్ చట్టం కింద అవగాహన కల్పిస్తున్నాం.

● భూ సమస్యల పరిష్కారం తీరు ఎలా ఉన్నది?

భూ సమస్యలను సాధ్యమైనంత వేగంగా పరిష్కారం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. అనేక వివాదాలు మన దగ్గరకు వచ్చేది ఒకలా ఉంటుంది. క్షేత్రస్థాయిలో సమస్యల మరోలా ఉంటుంది. అన్నీ కలెక్టర్ల స్థాయిలో పరిష్కారమయ్యే పరిస్థితి లేదు. ఇప్పుడు కొత్త ఆర్ఓఆర్ చట్టంలో ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయనున్నారు. వాటి ద్వారా గతంలో ఆర్డీఓ, జేసీ, కలెక్టర్ల వద్ద పరిష్కారమయ్యే సమస్యలను జిల్లా స్థాయిలోనే పరిష్కరించే వీలుంటుందని అభిప్రాయపడుతున్నాం. కొత్త జిల్లాల్లో ల్యాండ్ రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం కూడా కొన్ని సమస్యలకు కారణమవుతుంది.

● పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి తీసుకుంటున్న చర్యలు ఏంటీ..?

ప్రస్తుతం ఘనపసముద్రం చెరువు పనులు కొనసాగుతున్నాయి. అది పూర్తయితే 30 వేల ఎకరాలకు నీరందించవచ్చు. నిర్వాసితులకు సంబంధించి పీడీఎఫ్ అయ్యింది. అవార్డు అయితే పరిహారం అందుతుంది. శంకరసముద్రం పూర్తికి మంత్రి విజిట్ సందర్భంగా ప్రతిపాదనలు అందజేశాం. ఆర్‌అండ్‌ఆర్ సమస్య ఉన్నది. కాలనీల్లో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. బడ్జెట్ అప్రూవల్ రాగానే ఆ పనులు పూర్తిచేస్తే గ్రామాన్ని ఖాళీ చేయించవచ్చు.

వెక్కిరిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు

» సిబ్బంది కొరతతో ఇబ్బందులు

» చిన్నారులకు అందని పౌష్టికాహారం

మదనాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాలబాలికలు, గర్భిణులు, బాలింతలకు సరైన పోషకాహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను ప్రవేశపెట్టింది. వీటిలో అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు ఆయా ఉండి కేంద్రానికి వచ్చే చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు ప్రతీరోజు ప్రభుత్వం అందించే ఆహారాన్ని పెట్టాలి. నిత్యం చిన్నారులు, గర్భిణుల బరువు తూచుతూ ఉండాలి. వనపర్తి జిల్లాలో 1,185 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కానీ ఆయా కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాలు లేక కేంద్రాలు మూతపడుతున్నాయి. దీంతో పక్కన్న ఉన్న కేంద్ర కార్యకర్తకు బాధ్యతలు ఇవ్వడంతో 15 రోజులకు ఒకసారి కేవలం గుడ్లు, బియ్యం, పప్పు ఇచ్చి వెళ్తున్నారు. కేంద్రాల్లోనే చాలా రోజులు గుడ్లు ఉండటంతో వాసన వస్తున్నాయని చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నర్సింగాపురంలో మూతబడిన అంగన్‌వాడి కేంద్రం



మదనాపురంలో అన్నం వడ్డిస్తున్న దృశ్యం

పర్యవేక్షణ కరువు...

జిల్లాలో 1,185 కేంద్రాల్లో 59 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 313 సెంటర్‌లో ఆయాలు, 14 మంది సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని చోట్ల కార్యకర్త ఉన్న చోట ఆయా లేకపోవడం, ఆయా ఉన్న చోట కార్యకర్త లేకపోవడంతో ఉన్న వారు సెలువు పెడితే కేంద్రం మూతపడుతుంది. దీంతో పిల్లలకు పౌష్టకాహారం అందడం లేదు. పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని చోట్ల సక్రమంగా ఆహారం అందడం లేదు.

కల గానే ప్రీ ప్రైమరీ

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చింది. పిల్లలకు ఇక్కడనే చదువు నేర్పించి ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలి. ప్రభుత్వం త్వరగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరంతరం కేంద్రాలను పర్యవేక్షిస్తూ ఉంటే అంగన్‌వాడీలు బలోపేతం అయ్యే అవకాశం ఉంది.

నోటిఫికేషన్ వస్తే భర్తీ చేస్తాం..



జిల్లాలో పోస్టులు ఖాళీలుగా ఉన్న మాట వాస్తవమే. ఖాళీల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఖాళీలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ఖాళీల భర్తీపై నోటిఫికేషన్ వచ్చిన వెంటనే భర్తీ చేస్తాం.

- లక్ష్మమ్మ, జిల్లా సంక్షేమ అధికారిణి

జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు

● నవజాత శిశువు ప్రాణాలు కాపాడినందుకు..

● అవార్డు అందుకున్న 108 ఉద్యోగి రాజ్‌కుమార్

నారాయణపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మండలం పేరపళ్ల గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ గత పది సంవత్సరాల నుంచి 108లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా జాతీయ స్థాయిలో ఉత్తమ 108 ఉద్యోగిగా అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి నియోనేటల్ అంబులెన్స్‌లో నవజాత శిశువును రక్షించినందుకు జాతీయ స్థాయిలో ఉత్తమ 108 ఉద్యోగి అవార్డును జీవీకే ఈఎంఆర్ఐ ఫౌండర్ అండ్ చైర్మన్ జీవీ కృష్ణారెడ్డి, తెలంగాణ రాష్ట్ర 108 స్టేట్ హెడ్ ఖలీదు చేతుల మీదుగా బుధవారం రాత్రి హైదరాబాద్ తాజ్‌కృష్ణ హోటల్‌లో అందుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగికి అవార్డు రావడం అనేది ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ అధికారి రవికుమార్, జిల్లా ప్రోగ్రామ్ అధికారి రాఘవేందర్ పేర్కొన్నారు. అవార్డు అందుకున్న రాజ్‌కుమార్‌ను జిల్లా ఆసుపత్రి సిబ్బంది, కుటుంబ సభ్యులు, పలువురు అభినందించారు.

ఏడాదిలో రెండు సార్లు బెస్ట్ అవార్డులు

ప్రతీ ఏటా రెండుసార్లు ఆరు నెలలకోసారి ఉద్యోగి చేసిన సేవలకు గాను గుర్తించి జాతీయ స్థాయిలో అవార్డులు అందిస్తారు. అందులో 20 రాష్ట్రాల అంబులెన్స్ టెక్నీషియన్స్ పనితీరును బేరీజువేసుకొని జాతీయ స్థాయి అవార్డులు జీవీకే ఈఎంఆర్ఐ సంస్థ అందిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని నర్వ మండలం ఎరసన్‌పల్లి గ్రామానికి చెందిన మాధవి తన మొదటి కాన్పు కోసం నవంబరు 8వ తేదీ 2024 రోజు నర్వ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరింది. విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు కవిత సాధారణ ప్రసవం జరిగేలా చర్యలు తీసుకున్నారు.



108 నారాయణపేట జిల్లా ఆసుపత్రి నియోనేటల్ అంబులెన్స్

అయితే పుట్టిన పండంటి మగబిడ్డ ఏడువక పోవడం, శ్వాస తీసుకోక అపస్మారక స్థితిలో ఉన్న బిడ్డను గమనించి స్టాఫ్ నర్సు 108 నారాయణపేట జిల్లా ఆసుపత్రి నియోనేటల్ అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో హుటాహుటిన అంబులెన్స్‌తో నర్వ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్నారు. నవజాత శిశువు ఆరోగ్య పరిస్థితిని ప్రాథమిక అంచనా వేసి ఈఎంఆర్ ప్రొటోకాల్స్ పాటిస్తూ శివును అంబులెన్స్‌లోకి తీసుకుని ప్రాథమిక చికిత్స చేస్తూ ఆక్సిజన్‌తో పాటు ఫ్లూయిడ్స్ పెట్టి శిశు ఊపిరి ఆడేవిధంగా చర్యలు తీసుకున్నారు. అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. 48 గంటల తర్వాత శివు ఆరోగ్య పరిస్థితి గమనించి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని అక్కడున్న వైద్యులు సమాచారం అందించారు.

108కు రుణపడి ఉంటాం

సమయానికి వచ్చి 108 అంబులెన్స్ సిబ్బంది తనకు పుట్టిన కొడుకు ప్రాణాలు కాపాడారు. 108 సిబ్బందికి రుణపడి ఉంటామన్నారు.

- మాధవి, శిశువు తల్లి, ఎరసన్‌పల్లి, నర్వ

సరైన సమయంలో సరైన చికిత్స



నవజాత శిశువున కాపాడినందుకు చాలా సంతోషంగా ఉంది. సరైన సమయంలో చికిత్స అందించే విధంగా అంచనా వేసి శిశువుకు ప్రథమ చికిత్స చేస్తూ వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడినందుకు చాలా గర్వంగా ఉంది.

- రాజ్‌కుమార్, 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, నారాయణపేట

కామన్ మెనూ.. బాగుంది

- పెరిగిన మెస్, కాస్మెటిక్ చార్జీలు

అయిజటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులు అని పుస్తకాలలో చదువుకున్నాము. రాజకీయ నాయకులు కూడా అంతే గొప్పగా వేదికలపై ఈ మాటను ఉపన్యాసాల్లో వాడుతుంటారు. సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు 2008 నుంచి 2024 వరకు దాదాపు 16 ఏళ్లుగా మెస్ చార్జీలు పెంచే ఆలోచనను పాలకులు చేయకపోవడం విస్మయం కలిగించే అంశం. గతంలో చాలీచాలని మెస్ చార్జీలతో నాణ్యమైన ఆహారం అందక విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసిన సందర్భాలు ఉన్నాయి. వసతి గృహా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్టోబరు నెల నుంచి 40 శాతం అదనంగా డైట్ చార్జీలను పెంచింది. మూడు నుంచి ఏడో తరగతి చదివే విద్యార్థులకు రోజుకు రూ.44.33 పైసలు, 8,9,10వ, తరగతి విద్యార్థులకు రోజుకు రూ.51.33 పైసలు, ఇంటర్ ఆపైన చదివే వారికి రోజుకు రూ.70 పైసలు ప్రభుత్వం ఖర్చు చేయనుంది. దీంతో అన్ని సంక్షేమ, గురుకుల వసతి గృహాల విద్యార్థుల్లో ఆనందం వెల్లువిరుస్తోంది.

మెస్, కాస్మెటిక్ చార్జీలు ఇలా..

గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో 2024 అక్టోబరు కంటే ముందు మూడు నుంచి ఏడో తరగతి చదివే విద్యార్థులకు డైట్ చార్జీలు ప్రభుత్వం నెలకు రూ. 950, బాలికలకు కాస్మెటిక్ చార్జీలు రూ.55, బాలురకు రూ. 52, ఎనిమిది నుంచి పదో తరగతి చదివే బాలికలకు రూ.75, బాలురకు రూ.62 చెల్లించేవారు.

2024లో ప్రభుత్వం పెంచిన కొత్త ధరలు మూడు నుంచి ఏడో తరగతి విద్యార్థులకు నెలకు రూ.1,330లు కాగా, ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు నెలకు రూ. 1,540 చెల్లిస్తున్నారు. ఇంటర్ నుంచి డిగ్రీ, పీజీ చేసే విద్యార్థులకు నెలకు రూ. 2,100 విలువ చేసే ఆహారం అందనుంది. కాస్మెటిక్ చార్జీలు కూడా మూడు నుంచి ఏడో తరగతి చదివే బాలికలకు నెలకు రూ.175లు, ఎనిమిది నుంచి పదోతరగతి చదివే విద్యార్థులకు నెలకు రూ.275లు ఇవ్వనున్నారు. మూడు నుంచి ఏడో తరగతి చదివే బాలురకు రూ.150 లు, ఎనిమిది నుంచి పదో తరగతి వారికి రూ. 200లు అందనున్నాయి.



అయిజలోని బీసీ వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు



సాయంత్రం స్నాక్స్‌గా అందించే శనగలు



ఉదయం ఉగ్గాని వడ్డిస్తున్న వంట నిర్వాహకుడు

రోజువారీగా అందనున్న ఆహారం..

ఉదయం రాగిమాల్ట్, పూరి, బోండా, చపాతి, ఇడ్లీ, ఉగ్గాని, ఉప్మా ఇవ్వనున్నారు. మధ్యాహ్నం ఆకు కూరలు, కూరగాయల, పప్పు, సాంబరు, పెరుగుతో పాటు గుడ్డు, పండుతో కూడిన భోజనం. సాయంత్రం పల్లిపట్టీలు, నువ్వుల పట్టి, ఉడికించిన సెనగలు, అలసందలు ఇవ్వనున్నారు. రాత్రికి అన్నం, రసం, కూరగాయ, మజ్జిగతో భోజనం ఉంటుంది. ప్రతీ శనివారం షేమియా, పాయసం ప్రత్యేకం. నెలలో రెండు ఆదివారాలు చికెన్, రెండు ఆదివారాలు మటన్, బగార రైస్‌తో పాటు పెరుగు పచ్చడిని ప్రత్యేకంగా అందించనున్నారు.

పెరిగిన చార్జీలతో జిల్లాకు రూ. 2.5 కోట్లు

జోగులాంబ గద్వాల జిల్లాలో గురుకుల, సంక్షేమ వసతి గృహాలు 29 ఉన్నాయి. వీటిలో 2,496 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 3-7 వరకు 1,076 మంది, 8-10 వరకు 1,420 మంది విద్యార్థులు ఉన్నారు. మరో ఆరు ఇంటర్, పోస్ట్ మెట్రిక్ కళాశాలు ఉన్నాయి. వాటిలో కూడా 893 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికి ఏడాదికి మెస్ చార్జీల రూపేనా రూ.2 కోట్లు, కాస్మెటిక్ చార్జీల రూపేనా మరో రూ.50 లక్షలు పాత ధరలకు అదనంగా మంజూరు కానున్నాయి.

భోజనం చాలా బాగుంది



రెండేళ్లుగా నేను ఇక్కడే హాస్టల్లో ఉండి చదువుకుంటున్నాను. నెల రోజుల నుంచి మేము తినే భోజనంలో మార్పు వచ్చింది. గతంలో కంటే నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారు. రోజు ఒక రకమైన టిఫిన్ అందజేస్తున్నారు. గుడ్లు, పండ్లు, ఇతర పోషకాహారం అందుతుంది. గతంలో సాయంత్రం స్నాక్స్ ఒకే రకమైనవి ఇచ్చే వారు. ఇప్పుడు రకరకాలుగా అందిస్తున్నారు.

- శరత్‌కుమార్, 7వ తరగతి, బీసీ వసతి గృహం, అయిజ

మెనూ అమలు చేస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచింది. పెంచిన ధరలకు అనుగుణంగానే పిల్లలకు ప్రతీరోజు భోజనం అందజేస్తున్నాం. వసతి గృహాల్లో డ్రాప్ అవుట్స్ తగ్గుతున్నాయి. చికెన్, మటన్, గుడ్డు, పండ్లు, సాయంత్రం స్నాక్స్ తప్పనిసరిగా ఇస్తున్నాం. విద్యార్థులు రోజువారి స్లిప్‌టెస్ట్ లకు ఉత్సాహంగా హాజరవుతున్నారు.

- ఈశ్వర్, వార్డెన్ సంక్షేమ వసతి గృహం, అయిజ

రూ. లక్ష కొట్టు- బెల్ట్‌షాపు పెట్టు..



దోమలపెంట, డిసెంబరు 19: నల్లమల ప్రాంతంలో శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని దోమలపెంట, వటువర్లపల్లి, ఈగలపెంట, పాతాళంగంగ గ్రామాలలో నాటుసారా, బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయి. దోమలపెంటలో ప్రభుత్వ అనుమతితో నడుపుతున్న మద్యం షాపు యజమాని స్వయంగా బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. మద్యం దుకాణ దారుడు లక్షలో గుడ్‌విల్ తీసుకొని అచ్చంపేటకు చెందిన సిండికేట్ వ్యాపారులుకు అప్పచెప్పడంతో అనుమతి లేకున్నా పర్మిట్ రూం నడిపిస్తున్నారు. దోమలపెంట, ఈగల పెంట, పాతాళగంగ, మత్స్యకారుల కాలనీలో బెల్ట్ షాపులలో మద్యం అమ్మకానికి అడ్వాన్స్ రూ. 2లక్ష వరకు చెల్లించి అమ్మకాలు జరుపుతున్నారు. వీరికి ఎక్సైజ్‌శాఖ అండదండలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దోమలపెంట మద్యం షాపులో క్వార్టర్‌పై అదనంగా రూ. 20 అమ్ముతుండగా, బెల్ట్‌షాపుల వారు మరో రూ.30 అధికంగా అమ్ముతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నల్లమల ప్రాంతంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాల వలన చెంచులు తాగుడుకు బానిసలుగా మారి మృత్యు వాత పడుతున్నారని, పూర్తిగా మద్యం అమ్మకాలు నిషేధించాలని గతంలో చెంచు యువకులు పోలీస్ ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాల యువకులు వాపోతున్నారు.

మద్యం అమ్మకాలు నిలిపివేయాలి



నల్లమలలో ప్రతీ గ్రామం లో మద్యం అమ్మకాలు జోరు గా సాగుతున్నాయి. దీనివలన చెంచులు తాగుడుకు బానిసలై మృత్యువాత పడుతున్నారు. అక్రమ మద్యం అమ్మకాలపైనా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. త్వరలోనే చెంచు సంఘాల అధ్వర్యంలో గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం.

- చిగుర్ల మల్లికార్జున్, తెలంగాణ చెంచు వేదిక అధ్యక్షుడు

కఠిన చర్యలు తప్పవు

నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని చోట మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. సారా తయారీ చేసే వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం. డిపాజిట్ తీసుకోని బెల్టుషాపులు నడిపిస్తున్న విషయం తమకు తెలియదు. మద్యం టెండర్ దుకాణ దారుడిపై కేసు నమోదు చేస్తాం.

- కృష్ణ, ఎక్సైజ్ సీఐ, అచ్చంపేట

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో

కల్వకుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని జూనియర్ కళాశాలను డీఐఈవో వెంకటరమణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ రాంరెడ్డి, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కళాశాలలో డ్రెస్సు కోడ్‌తో పాటు ఐడెంటీ కార్డు అందించి విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ వేణు, అధ్యాపకులు సదానందంగౌడ్, మహబూబ్ అలీ, మల్లేష్, భీమేష్, రాజేష్, బాలరాజు, శ్రీనివాస్, మల్లికార్జున్, పరశురామ్, గిరిబాబు, లక్ష్మీకాంత్‌సాగర్, శ్రీనివాస్ ఉన్నారు.

దొరకని దొంగలు

వనపర్తి క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న చోరీలు జిల్లా పోలీసులకు సవాల్‌గా మారింది. ప్రతినిత్యం జిల్లాలో ఏదో ఒక చోట దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుని దుండగులు చోరీలు పాల్పడుతున్నారు. వరుస దొంగతనాలతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

పని చేయని కెమెరాలు

జిల్లావ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకపోవడం దొంగలకు కలిసి వచ్చింది. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలపై దృష్టి సారించి మరమ్మతులు చేస్తే నేరస్తులను పట్టుకునేందుకు వీలుగా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు

ఈ నెల 5వ తేదీన కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రైతు ధాన్యం విక్రయించి వచ్చిన డబ్బు రూ.2 లక్షల 20 వేల ఎత్తుకెళ్లారు. 12వ తేదీన జిల్లా కేంద్రంలో జ్యువెలరీ దుకాణం యజమాని బ్యాగులో తీసుకెళ్తున్న బంగారం ఎత్తుకెళ్లారు. ఇదే రోజు గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామంలో నాలుగు ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. 18వ తేదీన పెబ్బేరు జాతీయ రహదారిపై కారు నిలిపి నిద్రిస్తున్న వారిపై గుర్తు తెలియని దుండగులు కత్తులు, రాళ్లతో దాడి చేసి 14 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. ఇదే రోజు కొత్తకోట మండలంలోని విలియం కొండ తండాలో తాళాలు వేసిన మూడిళ్లలో తాళాలు పగలకొట్టి బంగారు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. ఇలా జిల్లాలో ప్రతీరోజు చోరీలు జరుగుతుండడంతో వ్యవసాయ పనులకు వెళ్లే ఇంటి యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కొత్తకోట: విలియం కొండలో చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి

గస్తీ పెంచుతున్నాం



ఇటీవల జరుగుతున్న ఘటనలను దృష్టిలో ఉంచుకుని కొత్తగా వచ్చిన పోలీస్ ఫోర్సుతో గస్తీ పెంచుతున్నాం. నేరాలను అరికట్టేందుకు రాత్రివేళలో ఇప్పుడు ఉన్న రెండు బీట్లతో పాటు మరో రెండు అదనంగా పెంచుతున్నాం. జాతీయ రహదారిపై కూడా ఏఆర్ పోలీస్ సిబ్బందిని నియమించి దారి దోపిడీలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం. జరిగిన దొంగతనాలలో రికవరీ కూడా అదే స్థాయిలో చేస్తున్నాం.

-రావుల గిరిధర్, ఎస్పీ

ఏఎన్ఎంలకు రాత పరీక్ష రద్దు చేయాలి

- మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఫసియోద్దీన్

- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్ఎంలకు రాత పరీక్షను చేసి వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలని మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.ఫసియోద్దీన్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఏఎన్ఎంలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండు దశాబ్దాల నుంచి ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా ఆరువేల మంది కాంట్రాక్టు ఏఎన్ఎంలు పని చేస్తున్నారని పేర్కొన్నారు. వారిని ఫర్మినెంట్ చేయకుండా వారిని రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని చెప్పడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలో చించి కనీస వేతనం రూ.27లకు పెంచి పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కర్యాదర్శి ఆర్‌శ్రీనివాస్, నాయకులు బాలస్వామి, శివరాములు, సుగుణ, అరుణ, శివాని, మంజుల, కృష్ణవేణి, హైమావతి, సౌమ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్


బాబు (ఫైల్)

వ్యాపారంలో నష్టం.. యువకుడి బలవన్మరణం

మానవపాడు, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-44 బోరవెల్లి స్టేజి సమీపంలో యువకుడు వేప చెట్టుకి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల మేరకు రాజోలి మండలం ననసూరుకు చెందిన కుమార్ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు బాబు (23) ఏడాది క్రితం అయిజ మండల కేంద్రంలో రెడిమేడ్ దుస్తుల వ్యాపారం మొదలుపెట్టాడు. ఇందులో నష్టం రావడం.. అప్పులు ఎక్కువై ప్రతి రోజు ఇబ్బంది పడుతుండేవాడు. బుధవారం రాత్రి బోరవెల్లి స్టేజి వద్దకు చేరుకుని స్నేహితుడు మహేష్‌కి ఫోన్ చేసి తల్లిదండ్రులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకునే సరికి బాబు మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

ఉప్పునుంతల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గుడిసె దగ్ధమైన ఘటన గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని పెమినిక్లలో చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తుర్పటి కృష్ణయ్య కుటుంబసభ్యులు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వసల వెళ్లారు. కాగా ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సర్వేలో నమోదు చేయించడానికి భార్యతో పాటు కృష్ణయ్య గ్రామానికి వచ్చారు. కాగా బుధవారం రాత్రి గుడిసెలో వంట చేసుకుని తిని, పక్కింటిలో నిద్రించారు. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి గుడిసె అంటుకోవడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలో ఉన్న ఓ బైక్, పైపులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. గురువారం ఆర్‌ఐ సుజాత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాదాపు రూ.3 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- ఆనవాలు లభించకుండా కారం చల్లిన దొంగలు


పెంట్లవెల్లిలో చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం, పోలీసులు

కొల్లాపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల కేంద్రంలోని ఓ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పట్టణంలో రాజునాయక్ నివాస గృహంలో నాలుగు తులాల బంగారు, వెండి ఆభరణాలు,రూ. 50వేల నగదు నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఇంట్లో కారం పొడి చల్లి ఆనవాలు లభించకుండా చేశారని, ఇంటికి తాళం వేసి ఉండడంతో చోరీకి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. క్లూస్ టీం, సీఐ మహేష్ చోరీకి గురైన ఇంటిని పరిశీలించారు. యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను అమర్చుకోవాలని పోలీసులు తెలిపారు.

పెంట్లవెల్లిలో 500 గ్రాముల వెండి..

పెంట్లవెల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన చేసిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏకాంబరెడ్డి ఐదు రోజుల క్రితం బంధువుల ఇంటికి షాద్‌నగర్‌కు వెళ్లారు. గురువారం ఇల్లు తెరుచుకొని ఉండటంతో ఇంటి పక్కన వారు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చి ఇంట్లో చూసుకునేసరికి 500 గ్రాముల వెండి అపహరణకు గురైనట్లు బాధితుడు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తికి జైలు శిక్ష

మక్తల్, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : యువతిని పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తికి పదేళ్ల జైలుశిక్ష, రూ.55వేల జరిమానా విధించినట్లు సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మి తెలిపారు. పట్టణానికి చెందిన యువతిని వివాహం చేసుకుంటానని రాజేష్ గౌడ్ హైదరాబాద్‌కు తీసుకువెళ్లి అద్దె భవనంలో ఉంటూ సహజీవనం చేశారు. కొన్ని రోజుల తర్వాత పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో తన ఇంటివాళ్లు ఒప్పుకోవడం లేదని చెప్పిన రాజేష్‌పై ఆగస్టు 28న 2021లో యువతి మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన కోర్టు మోసం చేసిన నిందితుడు రాజేష్‌కు జిల్లా ప్రధాన న్యాయాధికారి మొహ్మద్ అబ్దుల్‌రఫీ పదేళ్ల జైలుశిక్ష, రూ.55వేల జరిమానా విధించినట్లు వారు తెలిపారు.

వివాహితపై అత్తింటి వారి వేధింపులు

- ఆరుగురికి జైలు శిక్ష

మద్దూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వివాహితపై వేధింపుల కేసులో ఆరుగురికి కోర్టు జైలు శిక్షతోపాటు, జరిమానా విధించిందని సీఐ దస్రునాయక్ గురువారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మద్దూర్ మండలంలోని దంగాన్‌పూర్ చెందిన మునిరాబేగంను కోస్గి మండలంలోని ముష్రిషా గ్రామానికి చెందిన అబ్దుల్ రజాక్‌తో 15ఏళ్ల క్రితం వివాహమైంది. 2008లో భర్త అబ్దుల్ రజాక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భర్త పేరున వచ్చిన ఇన్సూరెన్స్ డబ్బులు భార్య మునిరాబేగంకు అత్తమామలు ఇవ్వకుండా తనను వేధిస్తున్నారని అక్టోబరు 3, 2017న మునిరాబేగం మద్దూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు కేసు నమోదు చేయగా ఎస్‌ఐ యాదగిరి దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ నమోదు చేశారు. గురువారం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయాధికారి పర్హిన్‌బేగం ఈ కేసులో నిందితులైన ఆరుగురికి 18 నెలల జైలు శిక్షతోపాటు రూ.2,500 జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు.

వైర్లు తగిలి వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం

నారాయణపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మన్‌పాడ్ శివారు పొలంలో గురువారం రైతు వెంకటప్ప వరి గడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగి గడ్డి పూర్తిగా కాలిపోయింది. నారాయణపేట అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో వెళ్లి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. దాదాపు రూ.20 వేల నష్టం వాటిల్లింది.

లేగ దూడపై చిరుత దాడి

కోస్గి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లేగదూడపై చిరుత దాడిచేసిన ఘటన గుండుమల్ మండలంలో చోటు చేసుకుంది. గురువారం మండలంలోని కొత్తపల్లి శివారులో చింతకాయల చిన్న రాములు పొలం వద్ద ఉన్న లేగదూడపై చిరుతపులి దాడి చేసింది. సుమారు నలభైవేల విలువగల లేగదూడ మృతి చెందిందని రైతు వాపోయారు. కాగా ఈనెలలో చిరుత రెండోసారి దాడిచేసింది. దీంతో గ్రామ శివారు రైతులు భయాందోళన చెందుతున్నారు.

మైసమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలి

- అటవీ భూమి సమస్యను పరిష్కరించండి
- అసెంబ్లీలో జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఫతేపూర్ మైసమ్మ ఆలయ అభివృద్ధికి చేయూత అందించాలంటూ ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. గురువారం అసెంబ్లీ సమావేశంలో అటవీశాఖ, గిరిజనుల మధ్య భూ వివాదాలకు సంబంధించిన అంశంపై జరిగిన చర్చలో నవాబ్‌పేట్ మండలంలోని ఫతేపూర్ మైసమ్మ ఆలయ అభివృద్ధి అంశంపై మాట్లాడారు. అప్పన్నపల్లి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఫతేపూర్ మైసమ్మ ఆలయం ఉండడంతో అభివృద్ధి పనులు చేయడానికి అవకాశం లేకుండా ఉందన్నారు. అటవీభూమికి బదులుగా మరో ప్రాంతంలో ఐదు ఎకరాల భూమిని అటవీ శాఖకు ఇచ్చేందుకు కలెక్టర్ సిద్ధంగా ఉన్నారంటూ సభ దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే లేవనెత్తిన అంశానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బదులు ఇచ్చారు. అటవీ భూ వివాదాలు అనేక ప్రాంతాలలో ఉన్నాయని, సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

హైడ్రా చట్టాన్ని అమలు చేయాల్సిందే..

హైడ్రా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిందేనని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. హైడ్రా అంశంపై జరిగిన చర్చలో మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గంలో తన సొంత గ్రామమైన రంగారెడ్డిగూడలో హైడ్రాను మొట్టమొదటి సారిగా అమలు చేయడం జరిగిందన్నారు. ఇరిగేషన్‌శాఖ అధికారులతో చెరువును సర్వే చేయించడంతో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న సొంత భూమి రెండు ఎకరాలను వదులుకున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకోసమైన చెరువులను కాపాడాలని, చెరువులను ఆక్రమిస్తున్న వారిలో ఎంతటివారినైనా ఉపేక్షించకూడదన్నారు.

బాలానగర్‌ను మునిసిపాలిటీగా మార్చడం అసాధ్యం

- జనాభా తక్కువగా ఉండటమే కారణం
- అధికారుల అధ్యయనంలో వెల్లడి
- తన వంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే వెల్లడి

జడ్చర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బాలానగర్‌ను మునిసిపాలిటీగా మార్చడం సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేశారు. జనసాంద్రత తక్కువగా ఉండటమే కారణమంటూ అధికారులు వెల్లడించారు. చదరపు కిలోమీటర్‌కు వెయ్యి మంది జనాభా ఉండాలని, అందుకు భిన్నంగా కేవలం 278 మంది మాత్రమే ఉన్నారని, తాము చేపట్టిన సాధ్య, అసాధ్యాల అధ్యయనంలో తేలిందంటూ అధికారులు తెలిపారు. జడ్చర్ల నియోజకవర్గంలోని బాలానగర్, నందారం, గుండేడు, గౌతాపూర్, పెద్దాయపల్లిని కలిపి బాలానగర్ మునిసిపాలిటీగా ఏర్పాటు చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కోరిన మేరకు, సాధ్య, అసాధ్యాయాలపై అధ్యయనం చేయాలంటూ అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త మునిసిపాలిటీల ఏర్పాటు అంశంపై అధికారులు చేపట్టిన అధ్యయనంలో జనసాంద్రత తక్కువగా ఉన్న కారణంగా బాలానగర్‌ను మునిసిపాలిటీగా ఏర్పాటు చేయడం సాధ్యం కాదన్న అంశాలను ఎమ్మెల్యే వివరించారు. అధికారులు వెల్లడించిన అంశాలను గురువారం జడ్చర్ల విలేకరులకు ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదించిన గ్రామాలన్నీ 30.45 చ.కి.మీ వైశాల్యం ఉందని, నిబంధనల మేరకు 30వేలకు పైగా జనాభా ఉండాల్సిన స్థానంలో 8,472 మంది మాత్రమే ఉండడంతో సాధ్యం కాదని అధికారులు వివరించారు. బాలానగర్‌ను మునిసిపాలిటీగా ఏర్పాటు చేసే అంశంలో తన వంతు ప్రయత్నం చేస్తానని ఆయన చెప్పారు.

ఉద్యోగులకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలి

- టీజీవో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాచర్ల రామకృష్ణగౌడ్


సమావేశంలో పాల్గొన్న నాయకులు

పాలమూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పాతపెన్షన్ విధానం అమలు చేసి రిటైర్డ్ అయిన వారిని పెన్షన్ అందజేయాలని టీజీవో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాచర్ల రామకృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో టీజీవో జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగులకు కొత్త పీఆర్‌సీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్‌కార్డులు ఇవ్వటంతోపాటు సీపీఎస్ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వరప్రసాద్, టైటస్‌పాల్, శ్రీనుగౌడ్, రాంపాల్, సంధ్య, శివరాజు, బాలుయాదవ్, తానాజీ, నరేష్, మురళీధర్, జాకీర్, గంగాధర్, జగదీష్‌కుమార్, వీరారెడ్డి, కరణం రాజు, శ్రీనివాసులు, నాగరాజు, ఇమ్రాన్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

80 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- లారీ, డీసీఎంలో లోడ్ చేస్తుండగా పట్టుకున్న పోలీసులు

మహబూబ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌బియ్యం ఏకంగా రాష్ట్రాలనే దాటిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం మహబూబ్‌నగర్ నుంచి అక్రమంగా కర్ణాటకకు బియ్యం తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో రూరల్ పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. మహబూబ్‌నగర్ సమీపంలోని ఆర్టీఏ కార్యాలయం సమీపంలోని దుర్గా ఇండస్ట్రీస్ నుంచి లారీ, డీసీఎంలలో లోడ్ చేస్తున్న బియ్యం పోలీసులు పట్టుకుని వాహనాలను సీజ్ చేశారు. రెండు వాహనాలలో ఉన్న బియ్యం వేయింగ్ మిషన్‌ల ద్వారా లెక్కించారు. దాదాపు 80 క్వింటాళ్ల వరకు ఉంటాయని పోలీసులు తెలిపారు. అయితే లారీ, డీసీఎంలు కావడంతో వందల క్వింటాళ్లే ఉంటాయని అర్థమవుతుంది. దుర్గా ఇండస్ట్రీస్ యజమాని బాలోజీ, గుజరాత్ రాష్ట్రం సూరత్ జిల్లాకు చెందిన లారీ ఓనర్ కమ్ డ్రైవర్ దేవరాజ్ కరంత, పరారీలో ఉన్న డీసీఎం డ్రైవర్ మన్సూర్‌లపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు


వన్‌టౌన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీసులు విస్తృతంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. గురువారం సాయంత్రం వన్‌టౌన్ చౌరస్తాలో పోలీసులు పెద్దఎత్తున వాహనదారులను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఓ వ్యక్తిని సెకెండ్ క్లాస్ న్యాయాధికారి ఎదుట హాజరుపరచగా వ్యక్తికి రూ. రెండు వేలు జరిమానాతోపాటు రెండు రోజులు జైలు శిక్ష విధించారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య మాట్లాడుతూ.. ప్రజలు సహకరించాలని, కోర్టులు కఠిన శిక్షలు విధిస్తాయన్న విషయాన్ని గమనించాలని కోరారు.

నకిలీ ఏజెన్సీ సర్టిఫికెట్ల మోసం

- ఇది వరకు ఉద్యోగాల్లోనే..
- వ్యాపార, రాజకీయాల్లో కూడా నాన్ ఏజెన్సీ వారి చొరబాటు

పదర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లమలో నాన్ లోకల్ వ్యక్తులు కొంత మంది దళారులతో కలిసి ఫేక్ ఏజెన్సీ సర్టిఫికెట్లు సృష్టించి స్థానికులను అన్యాయం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తిన విషయం విధితమే. దీంతో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కొంతమంది వ్యక్తులకు, అదే విధంగా వారిపై ఫిర్యాదు చేసిన పాత్లావత్ రమేష్, బాణావత్ బిక్యా నాయక్, ఎరుకలి నిరంజనమ్మలకు ఐటీడీఏ కార్యాలయంకు ఈ నెల 27న అన్ని ఆధారాలతో హాజరవ్వాలని నోటీసులు పంపినట్లు ఆ కార్యాలయ మేనేజర్ జాఫర్ తెలిపారు. ఇదిలా ఉండగానే వ్యాపార, రాజకీయాల్లో కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నట్లు రమేష్, బిక్యా తెలిపారు. అయితే ఓ వ్యక్తి పదర పెట్రోల్ బంక్‌తో పాటు, బల్మూరు మండల కేంద్రంలోనే ఏజెన్సీ కోటాలో వైన్స్ కూడ దక్కించుకున్నట్లు తెలిపారు. గతంలో రెండుసార్లు సర్పంచ్‌గా కూడా బల్మూరుకు చేశారన్నారు. ఇలాంటి వారు మరెంతో మంది ఉన్నారని వీరిపై ప్రభుత్వ యంత్రాగం రంగంలోకి దిగి నిజమైన ఏజెన్సీ గిరిజనులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఇన్ని ఆధారాలున్నా పాలకులు, అధికారులు ఎందుకు చూసి చూడనట్లు వ్యవరిస్తున్నారని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

నిజమైనోల్లకు అన్యాయం



బంధువుల సహకారంతో నకిలీ ఏజెన్సీ సర్టిఫికెట్లు ఇవ్వడంతో భావితరాల భవిష్యత్ నాశనమౌతుంది. నిజమైన ఏజెన్సీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- చత్రునాయక్, గిరిజన న్యాయవాధుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

గవర్నర్‌ను కలుస్తాం



ఏజెన్సీ ప్రాంతాల్లో అన్యాయంపై పీసా చట్టం తీర్మాణాలతో కలెక్టర్, గిరిజన శాఖ మంత్రిని కలుస్తాం. సమస్యలపై స్పందించకుంటే గవర్నర్‌ను కలుస్తాం. రెఫరెండంతో గవర్నర్, రాష్ట్రపతిని పీసా తీర్మాణాలతో ఇక్కడికే ఆహ్వానిస్తాం.

- చిగుర్ల మల్లికార్జున్, చెంచు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

సమ్మెలో టీచర్లు.. విద్యార్థుల కష్టాలు

- కస్తూర్బా పాఠశాలల్లో పాఠాలు చెప్పేవారు కరువు
- తరగతి గదుల్లో విద్యార్థులు మాత్రమే..
- 390 మంది టీచర్లు, 2,850 మంది విద్యార్థులు
- నిరవధిక సమ్మెలో సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ టీచర్లు


టీచర్ లేకపోవడంతో నారాయణపేట కస్తూర్బా తరగతి గదిలో ఖాళీగా కూర్చొన్న విద్యార్థులు

నారాయణపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులు వారం రోజులుగా చేస్తున్న సమ్మెతో జిల్లా వ్యాప్తంగా కస్తూర్బా విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు లేరు. విద్యార్థినుల సంరక్షణకోసం రోజు రాత్రి వేళ డ్యూటీ ఇంటర్‌కు ఒకరు, ఆరు నుంచి పదో తరగతి విద్యార్థుల కోసం మరొకరు విధుల్లో ఉంటున్నారే తప్పా బోధన మాత్రం చేయడం లేదు. జిల్లా వ్యాప్తంగా సమగ్రశిక్ష కింద 390 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. 11 కస్తూర్బాల్లో 2,850 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ముఖ్యంగా ఇంటర్, పదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదల కావడంతో తమ భవిష్యత్ ఏంటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. నారాయణపేట కస్తూర్బాను ఈ నెల 18న డీసీడీవో పద్మ నళిని సందర్శించి విద్యార్థులకు డిజిటల్ బోధన చేయాలని ఆదేశించారు. విద్యార్థులు మాత్రం తమకు వారం రోజులుగా పాఠాలు చెప్పేరు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజులుగా క్లాసులు లేవు

వారం రోజులుగా క్లాస్‌లు చెప్పడం లేదు. సిలబస్ పూర్తి కాలేదు. వార్షిక పరీక్షల టైం టేబుల్ వచ్చింది. ఫెయిల్ అవుతామనే భయం నెలకొంది. వెంటనే ప్రభుత్వం టీచర్లను బోధనకు పంపించాలి.

- వైష్ణవి, పదో తరగతి విద్యార్థి, నారాయణపేట

చర్యలు తీసుకుంటున్నాం..

కస్తూర్బాలో డిజిటల్ బోధనలకు చర్యలు తీసుకుంటున్నాం. ఏఈవోలు తమ పరిధిలో మహిళా ఉపాధ్యాయులు ఉంటే తాత్కాలికంగా పంపించి పాఠాలు బోధించేలా చుడాలని ఆదేశించాం.

- గోవింద రాజులు, డీఈవో, నారాయణపేట

ఆర్‌టీఐ యాక్ట్‌పై అవగాహన కలిగి ఉండాలి

- మహబూబ్‌నగర్ ప్రాంతీయ శిక్షణ మేనేజర్ హనుమంతు


మాట్లాడుతున్న శిక్షణ మేనేజర్ హనుమంతు, రిసోర్స్ పర్సన్ శ్రీధర్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌టీఐ యాక్ట్‌పై అందరికి అవగాహన ఉండాలని మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతీయ శిక్షణ మేనేజర్ హనుమంతు, రిసోర్స్ పర్సన్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఐడీవోసీలో మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు ఆర్‌టీఐపై ఒక రోజు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌టీఐ ద్వారా ప్రభుత్వ కార్యాలయానికి సంబంధించిన వివరాలు, నిధులు, పని చేసే ఉద్యోగులు, అధికారులు, పర్యవేక్షణ సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు. కోరిన సమాచారం పంపించడానికి వీలుగా దరఖాస్తుదారుడు చిరునామాలను రాసి అందించాలన్నారు. కోరిన సమాచారాన్ని 30 రోజులలో పరిష్కరించాల్సి ఉంటుందని చెప్పారు.

తిరుమలలో తెలంగాణ భక్తులపై వివక్ష

- సీఎం చంద్రబాబు జోక్యం చేసుకోవాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శ


తిరుమలలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన దర్శనంలో తెలంగాణ రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సామాన్య ప్రజలు వివక్షకు గురవుతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. గురువారం ఏపీలోని తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో తెలంగాణ ప్రజలపై వివక్ష ఉండేది కాదన్నారు. ప్రస్తుతం వివక్షకు గురి కావడం తెలంగాణ సమాజానికి బాధను కలిగిస్తుందన్నారు. టీటీడీ పాలక మండలిపై తమకు గౌరవం ఉందన్నారు. గతంలో మాదిరిగానే శ్రీవారి దర్శనంలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తెలంగాణలోని హైదరాబాద్‌లో పదేళ్లలో ఆంధ్ర ప్రజలపై ఎలాంటి విద్వేష భావాలు చూపలేదన్నారు. సోదరభావంతో కొనసాగామన్నారు. తెలంగాణలో టీటీడీ కల్యాణ మండపాలకు స్థలాలు కేటాయించడం అదృష్టంగా భావిస్తామన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు కేటాయించిన మాదిరిగానే తెలంగాణకు కాటేజ్ నిర్మాణం కోసం ఎకరం స్థలం కేటాయించాలని ఆయన ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన వెంట మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు తదితరులు ఉన్నారు.

కోదండ స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి

అచ్చంపేటటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో కోదండ స్వామి దేవాలయం నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. భూమి పూజ కార్యక్రమంలో త్రిదండి దేవనా థ రామానుజ జీయర్ స్వామి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం గ్రామస్థులు ముందు కు రావడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లోక్యానాయక్ పాల్గొని పూజలు చేశారు. వారిని గ్రామస్థులు శాలువాతో సత్కరించారు.

కేరళ యూనివర్సిటీ ఎన్నికల్లో పెద్దపొర్ల విద్యార్థి గెలుపు


విద్యార్థి మల్లేష్

ఊట్కూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపొర్లకు చెందిన సాయిబొల్ల మల్లేష కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ తరఫున కంప్యూటర్ సైన్స్ డిపార్టుమెంట్ నుంచి సభ్యుడిగా పోటీచేసి గెలుపొందాడు. హన్మంతు, పద్మమ్మల మూడో సంతానమైన మల్లేష్ కేరళలలో ఎంఎస్‌సీ కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. ఈ క్రమంలో ఎస్ఎఫ్ఐలో చేరి విద్యార్థుల హక్కుల కోసం పోరాటం చేస్తు గుర్తింపు పొందడంతో సంఘం నాయకులు డిపార్టుమెంట్ తరఫున పోటీలో దింపారు. గతంలో ఇదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఉపాధ్యక్షుడిగా గెలుపొందగా ఇప్పుడు మల్లేష్ సైతం ఎన్నికల్లో గెలవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పీడీఎస్‌యూ నాయకులు అనిల్, హన్మంతు, చంద్రశేఖర్ తదితరులు అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ కేతేపల్లి వెంకటయ్య(60) మృతి చెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూర్ చెందిన కేతేపల్లి వెంకటయ్య ఈ నెల 4న తన వ్యవసాయ పొలం వద్ద ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం అందించాల్సిందిగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని కుమారుడు కేతేపల్లి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

ఇంటర్వ్యూ..

శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలి

- ఎస్‌ఐ చంద్రకాంత్, మానవపాడు



మానవపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీఒక్కరు సహకరించాలని ఎస్‌ఐ చంద్రకాంత్ అన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా, ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించినా, నిబంధనలు పాటించకపోయినా చర్యలు తీసుకుంటామని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు. మండలంలో శాంతి భద్రతలు, ఇతర అంశాలపై గురువారం మాట్లాడారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. ఒకవేళ ఇస్తే తర్వాత జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాంటి వారినిగుర్తించి కేసులు నమోదు చేస్తాం. వాహనం నడిపే వారికి తప్పకుండా లైసెన్స్ హెల్మెట్ ఉండాలి. ప్రతీ ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరుగకుండా ఉంటాయి. దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

చోరీల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రతీరోజు రాత్రివేళ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుంటాం. అలాగే ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ప్రతీఒక్కరి కదలికలపై దృష్టి పెడతాం. ప్రజలు కూడా పరిస్థితులను గమనిస్తూ జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

యువతకు మీరిచ్చే సందేశం

మండలంలోని యువత సమయాన్ని వృథా చేసుకోవద్దు. చదువైనా, పని అయినా లక్ష్యంతో ముందుకెళ్లాలి. లక్ష్యం లేకుంటే జీవితంలో ముందుకుసాగలేం. మద్యం, జూదం వంటి చట్ట వ్యతిరేక వ్యవహారాలకు దూరంగా ఉండాలి.

న్యూస్ బాక్స్

వాహనాల తనిఖీ



శాంతినగర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వడ్డేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కేంద్రం శాంతినగర్‌లో గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల ఆర్‌సీ, లైసెన్స్, ఇతర పత్రాలను వెంట ఉంచుకోవాలని వాహనదారులకు సూచించారు. లేదంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రోడ్డునియమాలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ తిమ్మప్ప, రఘునాథ్ గౌడ్, ఆలీబాబు ఉన్నారు.

'న్యాయమైన డిమాండ్ కోసం పోరాడుతాం'

అయిజటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాలల న్యాయమైన డిమాండ్ కోసం పోరాడుతామని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్ అన్నారు. అసెంబ్లీ ముట్టడి పిలుపుని పురస్కరించుకుని గురువారం ముందస్తుగా పోలీసులు మాల మహానాడు నాయకులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అందరు వారి వారి అభిప్రాయాలను నిర్భయంగా వెలిబుచ్చే అధికారం ఉందన్నారు. ప్రభుత్వానికి తమ డిమాండ్లను విన్నవించుకునేందుకు హైదరాబాదు వెళ్లేందుకు సిద్ధమైతే ముందస్తుగా అరెస్ట్ చేయటం మంచిది కాదన్నారు. అరెస్ట్ అయిన వారిలో శివరాజు, భక్తకృష్ణ, నాగరాజు, లక్ష్మన్న, సురేష్‌కుమార్, వీరేష్, మద్దిలేటి, మల్లేష్, తిరుమలేష్, పరమేష్, మునిస్వామి ఉన్నారు.

కలప ట్రాక్టర్ పట్టివేత



అధికారులు పట్టుకున్న కట్టెల ట్రాక్టర్

కేటీదొడ్డి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా కట్టెలను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. ఫారెస్ట్ అధికారి మన్యం మాట్లాడుతూ గద్వాలకు చెందిన ఓ కట్టెల వ్యాపారి కేటీదొడ్డి మండలంలో అక్రమంగా చెట్లను నరికి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా మైలగడ్డ స్టేజీ దగ్గర పట్టుకున్నామన్నారు. కట్టెల రవాణాకు అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్‌ను జిల్లా అటవీశాఖ కార్యాలయానికి తరలించామన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఈఈలు, డీఈలతో, టీఎస్‌ఎంఐడీసీ, ఈడబ్ల్యూఐడీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన వివిధ నిర్మాణ పనుల పురోగతిని, అసంపూర్తిగా ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈడబ్ల్యూఐడీసీ పరిధిలోగల నిర్మాణపు పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ముఖ్యంగా కేజీబీవీ రాజోలి, బాలసదన్ పూర్తిచేసి నెలవారి పురోగతి నివేదికలను అందించాలని ఆదేశించారు. టీఎస్‌ఎంఐడీసీ అధికారులను మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, క్రిటికల్ కేర్, సబ్ సెంటర్ల అసంపూర్తిగా ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫెడ్.డీఆర్ పనులు, రోడ్ల పనులు, విస్తరణ పనులు, బీటీరోడ్లు, కనెక్టివిటి, సీసీ రోడ్లను, భవనాల నిర్మాణపు పనులు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను సూచించారు. గ్రామాల్లో పెండింగ్ పనులను పర్యవేక్షించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్నిశాఖలు తమ పరిధిలోని పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మంజూరైన పనులన్నీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో కాంతమ్మ, టీఎస్‌ఎంఐడీసీ డీఈ శ్రీనివాసులు, ఈఈపీఆర్ దామోదర్‌రావు, ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రగతి, అధికారులు ఉన్నారు.

గట్టు మండలంలో అభివృద్ధి జరగాలి

జిల్లాలోని గట్టు మండలంలో వైద్య, విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గట్టు మండల అభివృద్ధికి ఆస్పిరేషనల్ బ్లాక్ పథకం కింద ఉన్న 39 సూచికలు, సంపూర్ణ అభ్యనాథ్ ప్రోగ్రాం కింద ఉన్న ఆరు సూచికలపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గట్టు మండలంలో అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలో కొన్ని విభాగాలు వెనుకబడి ఉన్నాయని, తక్షణమే వాటి పూర్తికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ సూచికకు సంబంధించిన వివరాలు, ప్రగతిస్థాయి, సమస్యలు స్పష్టంగా వివరించాలని, సమగ్ర డేటా సమర్పించాలని సూచించారు. త్వరలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జిల్లాను సందర్శించనున్న సందర్భంగా అన్ని శాఖాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, కార్యక్రమానికి సంబంధించి శాఖల ప్రగతిని ప్రదర్శించే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్ని, పూర్తి సమాచారం తక్షణమే సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అధికారులు ఉన్నారు.

క్రీడా పోటీలతో విద్యార్థుల్లో నైపుణ్యానికి పదును



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు

అయిజ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీలు విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యానికి పదును పెడతాయని అయిజ తహసీల్దార్ జ్యోతి, ఎంఈవో రాములు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలిఆచారి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈనెల 16 నుంచి 19వ తేదీ నిర్వహించిన ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. మండలస్థాయిలో, జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికవడంతో వారిని ఎంఈవో రాములు గురువారం అభినందించారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరు ఈనెల 30న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్ఎంలు

గద్వాలన్యూటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వీవీ నర్సింహ ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్పకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ, ఏఎన్ఎంలు నాగమ్మ, భారతి, శ్యామల, అరుణ, పుష్ప, వెంకటేశ్వరమ్మ, మరియమ్మ, సరస్వతి ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● ఎంపీడీవో రామకృష్ణ

వడ్డేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీరోజు మోనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని ఎంపీడీవో రామకృష్ణ పాఠశాలల హెడ్‌మాస్టర్లు, ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. వడ్డేపల్లి మండల పరిధిలోని జూలేకల్ యూపీఎస్ పాఠశాల, వెంకట్రామానగర్‌లోని పాఠశాలలను ఎంపీడీవో సందర్శించారు. ముందుగా పాఠశాలలో సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పరిశీలించారు. కూరగాయలు, సరుకులు తాజాగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

అలాగే ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఇంటింటికీ తిరుగుతూ సేకరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి హరిత, సిబ్బంది ఉన్నారు.

అంబేడ్కర్‌పై వ్యాఖ్యలు అనుచితం

● ప్రజా సంఘాలు, పార్టీల నిరసన

గద్వాల టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అనుచితమని ప్రజాసంఘాలు, పార్టీలు, కుల సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. హోంశాఖ మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా గురువారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ప్రజాసంఘాలు, పార్టీలు, కుల సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

హోంశాఖ మంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఆంజనేయులు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఇక్బాల్ పాషా, మోహన్‌రావు, పూడూరు అచ్చన్న గౌడ్, వాల్మీకి, గోపాలరావు, ఎండీ సుభాన్, నరసింహ ఉన్నారు.

చదువుతోనే భవిష్యత్తు

● జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి ప్రియాంక

గట్టు(గద్వాల), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుకుంటేనే భవిష్యత్ బాగుంటుందని విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలని జిల్లా ఎంప్లాయ్‌మెంటు అధికారి ప్రియాంక విద్యార్థులకు సూచించారు. గురువారం మండలంలోని ఇందువాసి గ్రామాన్ని సందర్శించి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలు తనిఖీ చేశారు. తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థులకు గైడెన్స్‌తో పాటు మోటివేషన్ క్లాస్‌లు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత కావడానికి పాటించవలసిన మెళకువలు వివరించారు. అనంతరం విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేసి నాణ్యతను తెలుసుకున్నారు. ఈమె వెంట ప్రధానోపాధ్యాయులు నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి

● ఎంఈవో వెంకటేశ్వరరావు

కేటీదొడ్డి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల సమయానికి ఉపాధ్యాయులంతా విధుల్లో ఉండాలని మండల విద్యాధికారి వెంకటేశ్వరరావు చెప్పారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎంఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను భోజనం నాణ్యతతో వండుతున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే వంట గదిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట ఏజెన్సీ మహిళలకు పలుసూచనలు చేశారు. అనంతరం సోంపురం, యర్సన్‌దొడ్డి, చింతలకుంట గ్రామాల్లోని పాఠశాలలను తనిఖీ చేశారు.

ఉచితంగా దుస్తులు పంపిణీ



దుస్తులు అందజేస్తున్న ఉపాధ్యాయురాలు

అయిజటౌన్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): అయిజ సంత బజారులోని ప్రభుత్వ పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయురాలు మమత వంట ఏజెన్సీ నిర్వాహకులకు, పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని అందజేసినట్లు తెలిపారు.

'నిషేధిత భూముల జాబితా కలెక్టర్ పంపలేదు'

అలంపూర్ చౌరస్తా డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉండవెల్లి మండలం పుల్లూరులో పలు సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూములు నిషేధిత జాబితాలో కలెక్టర్ చేర్చలేదని, నిషేధిత జాబితాలో ఉన్నట్లు ఆర్డీవో, తహసీల్దార్ మాకు ఎలాంటి జాబితా అందించలేదని అలంపూర్ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఇబ్రహీం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకే సదరు భూముల రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

అమిత్‌షా తక్షణమే పదవికి రాజీనామా చేయాలి

- జిల్లా వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు



గద్వాలలోని వైఎస్సార్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

గద్వాల టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పైన, భారత రాజ్యాంగంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన హోంశాఖ మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రెప్ప డిమాండ్ చేశారు అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం పట్టణంలోని వైఎస్సార్ చైరస్తాలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా కర్రెప్ప మాట్లాడుతూ రాజ్యాంగంపై, అంబేడ్కర్‌పై బీజేపీ వైఖరి చట్టసభల సాక్షిగా మరోసారి బహిర్గతమైందన్నారు. మతోన్మాద విధానాలను తిప్పికొట్టేందుకు పార్టీలకు అతీతంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. హోంమంత్రి తక్షణమే తన వ్యాఖ్యలను వెనకకు తీసుకుని జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మారెన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, హుజురప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి ఉన్నారు.

● అయిజ: హోంశాఖ మంత్రి అమిత్ షాను వెంటనే పదవి నుంచి తొలగించాలని బీఆర్‌ఎస్వీ జిల్లా కన్వీనర్ కుర్వ పల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం అయిజలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిన్న పార్లమెంట్‌లో అమిత్ షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు దేశంలో మనువాదాన్ని పెంచేదిగా ఉన్నాయన్నారు. అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని, బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్, వీరేష్, మాధవ్, మైబు, రంగన్నగౌడు పాల్గొన్నారు.

● అలంపూరు: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాజు డిమాండు చేశారు. అలంపూరులో గురువారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప, కార్యదర్శి మౌలాలి, నరసింహ పాల్గొన్నారు.

● గద్వాల టౌన్: పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమాన పరిచేలా అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరమని, తమపార్టీ తీవ్రంగా ఖండిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీ ముందు నుంచే అంబేడ్కర్‌ను వ్యతిరేకిస్తూ ఉందన్నారు. అమిత్‌షా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, పదవికి రాజీనామా చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తం ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

విద్యార్థినులు సమస్యలుంటే చెప్పాలి

● న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంట కవితాదేవి



బురదపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న గంట కవితా దేవి

గద్వాల టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను రాతపూర్వకంగా తెలియజేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంట కవితా దేవి విద్యార్థినులకు సూచించారు. గురువారం పట్టణంలోని బురదపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గంట కవితాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మెనూప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల ఆవరణను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంట కవితాదేవి మాట్లాడుతూ విద్యార్థినులు అందరూ క్రమశిక్షణతో మెలగాలని, ప్రణాళికాబద్ధంగా చదవి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. మూత్రశాల గదుల సౌకర్యం సరిగ్గాలేదని, పాఠశాల ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని విద్యార్థినుల తల్లిదండ్రులతో పాటు బురదపేటవాసులు అధికారి దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు తగు సూచనలు చేస్తామని విద్యార్థినులకు, ఉపాధ్యాయులకు తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే రాతపూర్వకంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు.

క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

● డీవైఎస్‌వో ఆనంద్



కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో ఆనంద్

గద్వాల అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడా సంఘాలు ఏర్పాటు చేసిన క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్‌ఓ ఆనంద్ చెప్పారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో మహిళా కబడ్డీ కోచింగ్ క్యాంపునకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడారు. సీఎం కప్ పోటీలకు ఎంపికైన మహిళా కబడ్డీ క్రీడాకారులకు క్యాంపు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కోచ్‌లు ఇచ్చే సలహాలు, సూచనలను క్రమశిక్షణతో నేర్చుకోవాలని చెప్పారు. క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ కబడ్డీ క్రీడాకారులు కబడ్డీ నరసింహ, రవి, కరెంటు నరసింహ, కోచ్ జగదీష్, రాజు, రఘు, వెంకటన్న, మహేష్, శివశంకర్, మణి ఉన్నారు.

వరద బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



వరద బాధితులతో కలిసి అలంపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు

- ఎమ్మార్పీఎస్, సీపీఎం నాయకులు

అలంపూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అలంపూరు పట్టణం సంత మార్కెట్‌కాలనీ దళితులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు, దేవదాసు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి పోగు ప్రేమదాసు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం, ఎమ్మార్పీఎస్, తెలంగాణ సంఘాల ఆధ్వర్యంలో సంత మార్కెట్ కాలనీ దళితులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుముందు సొంత మార్కెట్ కాలనీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్ మంజులకు అందజేశారు. గతంలో కలెక్టర్, అలంపూరు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసినా ఇళ్లస్థలాలు కేటాయించడం లేదన్నారు. వరద బాధితుల కోసం కొనుగోలు చేసిన 43 ఎకరాలలో సంత మార్కెట్ దళితులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనవరి 5వ తేదీలోపు స్థలాలు కేటాయించకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం టౌన్ కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు నరసింహ, అయ్యప్ప, మౌలాలి, గంగన్న, దళితులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన ప్రభుత్వ భూముల కేటాయింపు



మాట్లాడుతున్న డాక్టర్ రఘునాథ్‌రెడ్డి

గద్వాల క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల కేటాయింపు ఇష్టారీతిన చేస్తున్నారని సీనియర్ రాజకీయ నేతలు డాక్టర్ రఘునాథ్‌రెడ్డి, వెంకటాద్రిరెడ్డి అన్నారు. నూతన కోర్టు భవన నిర్మాణానికి పీజేపీ కాలనీలో స్థలం కేటాయించాలని కోరుతూ జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులు చేపట్టిన నిరసన దీక్షలు గురువారం రెండవ రోజుకు చేరాయి. వీరి దీక్షకు వివిధ పార్టీల నాయకులు, డాక్టర్లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘునాథ్ రెడ్డి, వెంకటాద్రిరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ స్థలాలను గద్వాల అధికారులు తమ ఇష్టం వచ్చిన రీతిలో పంచుతున్నారని విమర్శించారు. 59 ఎకరాలతో ఉన్న పీజేపీకాలనీలో ఇష్టానుసారంగా కట్టడాలు నిర్మించారన్నారు. ఎక్కడా లేనివిధంగా గద్వాల కలెక్టర్ కార్యాలయంలో ఆడిటోరియం నిర్మిస్తామని చెబుతున్నారని, ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అతిథిగృహం పక్కన ఆడిటోరియం ఉన్నదని, పోలీస్ వారి గృహాల కోసం రెవెన్యూ కాలనీ వద్ద 10ఎకరాల స్థలం ఉందన్నారు. వాటిని వినియోగించుకోవాల్సింది పోయి ఇక్కడే ఆడిటోరియం కట్టిస్తాం, పోలీస్ క్వార్టర్స్ నిర్మిస్తామని చెప్పడం అధికారులు మానుకోవాలన్నారు. కక్షిదారులు, ప్రజల సౌకర్యార్థం పీజేపీకాలనీలో నూతన కోర్టు సముదాయాలకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు చేస్తున్న దీక్షలను నేతలు అమరవాయి కృష్ణారెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు సంఘీభావం తెలిపారు.

సరిహద్దులో కొనసాగుతున్న వాహన తనిఖీలు

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు జరుగుతున్న తెలంగాణ, ఏపీ సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి పొద్దుపోయాక ఏపీ నుంచి తెలంగాణలోకి ప్రవేశిస్తున్న తొమ్మిది వరి ధాన్యంలోడ్ లారీలను అధికారులు నిలిపివేశారు. మార్కెట్ చెస్ వసూలు చేసి వే బిల్లులు ఉన్న రెండు వాహనాలను మాత్రమే అనుమతించామని తెలిపారు.

మిగతా లారీలను వెనక్కి పంపినట్లు అలంపూరు వ్యవసాయ మార్కెట్ సెక్రెటరీ ఎల్లస్వామి తెలిపారు.

'అమ్మ'చైర్మన్‌లు పాఠశాలలను పర్యవేక్షించాలి

● ఎంఈవో భగీరథ రెడ్డి



కమిటీ చైర్మన్‌లతో మాట్లాడుతున్న ఎంఈవో భగీరథ రెడ్డి

రాజోలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు క్రమం తప్పకుండా పాఠశాలలను పర్యవేక్షించాలని రాజోలి ఎంఈవో భగీరథరెడ్డి అన్నారు. రాజోలిలోని ఎమ్మార్సీ భవనంలో గురువారంఎంపీఎఫ్ ఆధ్వర్యంలో ఆయన మండల స్థాయి అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారి విధులు, బాధ్యతలు గురించి అవగాహన కల్పించారు. ఎంపీఎఫ్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల హాజరును పరిశీలించాలని, పాఠశాలలో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం అందించేలా చూడాలని చెప్పారు. అలాగే పాఠశాలల్లో పారిశుధ్య పనులను కూడా నిత్యం పరిశీలించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి శాంతిరాజు చెప్పారు.

కార్యక్రమంలో టీఎస్ఎస్ మెంబర్ రజియ, ఏపీ చైర్మన్లు బుజ్జమ్మ, మానస, మార్దమ్మ, బుచ్చమ్మ, సీసీలు దేవదాసు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.